

# ఎందుకే నీకింత తొందరా...

## – బలభద్రపాత్రుని రమణి



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

"మీ ఇద్దరికీ ఎలా పరిచయం?" ధీరజ్ అడిగాడు.

"ఒకే ఫ్లయిట్‌లో వచ్చాం" అన్నాను.

"పక్క పక్క సీట్స్‌లో కూర్చున్నాం. ఇద్దర ఎన్నో విషయాలు షేర్ చేసుకున్నాం. ఎయిర్‌పోర్ట్‌లో విడిపోయే ముందు ట్రామ్ లో."

"ఏయ్.."కంగారుగా అన్నాను. సిగ్గులేకుండా అదీ చెప్పేస్తాడా? అధిక ప్రసంగీ అని.

"చెప్పనీయండి. మనవాడేగా" అన్నాడు ద్వారక.

"ఏం జరగలేదు" అన్నాను కంగారుగా.

"అదేంటండీ మర్చిపోయారా?" ద్వారక కళ్ళు పెద్దవి చేసి చూస్తూ "గుర్తు తెచ్చుకోండి మనిద్దరం విడిపోయే ముందు" అన్నాడు.

"ఏం జరిగిందీ?" ధీరజ్ అడిగాడు.

"ఏం లేదు" అన్నాను.

"ఎడ్రస్ అడిగాను. కనీసం ఫోన్ నెంబర్. ఈవిడ డెస్టినీలో వుంటే కలుస్తాం లెండి అని వెళ్ళిపోయారు. ఇప్పుడేం అంటారూ?" అన్నాడు ద్వారక.

"అమ్మయ్యా" అనుకున్నాను. నా గుండెలు కుదుటబడ్డాయి.

"డెస్టినీ కెనాట్ బీ చేంజ్‌డ్" అన్నాడు ధీరజ్.

"మీరేం అంటారు?" ద్వారక అడుగుతూ తన పెదవులని తన వేలితో రాసుకున్నాడు.

ఆ సైగకి ఉలిక్కిపడ్డాను. "అమ్మో! ఇతను కొంపముంచే రకమే అనిపించింది.

"సరే అమ్మని చూద్దాం రా" ధీరజ్ టాపిక్ మార్చాడు. నేనూ వాళ్ళతోబాటు నడిచాను. వాళ్ళిద్దరూ కాలేజ్ విషయాలూ, మిగతా ఫ్రెండ్స్ విషయాలూ మాట్లాడుకుంటూ నడిచారు. ద్వారకకి పరి గురించి కూడా తెలుసు. ఎంత ఫూలిష్‌గా 'నా బోయ్ ఫ్రెండ్' అని ధీరజ్‌ని చూపించానూ అని సిగ్గుపడ్డాను. అరెరే... నేను సిగ్గు పడుతున్నాను. ద్వారక 'ట్రామ్ లో' అనగానే నేను సిగ్గుపడ్డాను. తొలిముద్దు అనొచ్చా? నా మొహం, పెదవులకి లిప్ బాం రాసినట్లు, అదేం తొలి ముద్దూ? మరి తొలి ముద్దు కాకపోతే, అంతలా ఒళ్ళు ఝుల్లుమందేం? మనసు మధ్యలోకొచ్చేసింది మళ్ళీ, దీనికి పిలవని పేరంటాలు ఎక్కువ.

ద్వారక తల్లి బాబ్ కట్‌తో, ఫ్రాక్‌తో, ఏమరుపాటుగా చూస్తే అమెరికన్‌లా వుంది. కానీ ఆవిడ ధీరజ్‌ని చూడగానే "ఏం నాయనా? బొత్తిగా కనిపించడం మానేసావూ?" అని పలకరించడంలో తెలుగుదనం వుట్టిపడింది. ఆవిడ కూర్చున్నది చక్రాల కుర్చీ.

"మా కజిన్ రుషి" అని ధీరజ్ నన్ను పరిచయం చేసాడు.

"నమస్తే అండీ" అన్నాను.

"నమస్తే. ఇలా చక్రాల కుర్చీకి అంకితం అయిపోయాక, హాస్పిటల్‌కి తప్ప బయటకి వచ్చేపని లేదుగా. అన్నీ ద్వారక మీదే పడిపోయాయి. ఇక్కడ నన్ను చూసుకోవాలి. ఇండియా వెళ్ళి తండ్రిని చూసుకోవాలి బిడ్డ నలిగిపోతున్నాడు" అందావిడ.

నేను మళ్ళీ షాక్. ఈ బిడ్డ నలిగిపోతున్నాడా? మొహంలో కానీ బాడీ లాంగ్వేజ్‌లోకానీ అలా లేడే?

"నన్ను ఒక్క పని చేసుకోనివ్వడు. ఒక్కోసారి నేను వీడి బిడ్డనేమో అనిపిస్తుంది" ఆవిడ ధోరణిగా చెప్పుకుపోతున్నారు.

ద్వారక ఆవిడకి కాఫీ అందించాడు. ఆవిడ సిప్ చేస్తుంటే మూతి తుడిచాడు.

ధీరజ్ ఆవిడని యోగక్షేమాలు అడిగాడు. నేను తల్లిని అపురూపంగా చూసుకుంటున్న ద్వారకని చూసాను. అతన్ని ఫ్లయిట్‌లో చూసినప్పుడు ప్లేబోయ్ అనుకున్నాను. కానీ అతను ప్రతి పనీ దీక్షగా, గొప్ప ఏకాగ్రతతో, ఆనందిస్తూ చేస్తాడని ఇప్పుడు అర్థమైంది. ఆవిడ జుట్టు సవరించాడు.

ఆవిడ మాట్లాడ్తూనే వుంది. "వీడు మొన్న ఇండియా వెళ్తే నాకు తోచలేదు. సమస్త ఏర్పాట్లూ చేసి వెళ్ళాడు. కేర్ టేకర్ చాలా బాగా చూసుకుంటుంది. అయినా వాడు గలగలా మాట్లాడ్తూ ఇంట్లో లేకపోతే నాకు అస్సలు తోచదు. అన్ని విధాలా వాడి మీద ఆధారపడడం తప్పేకానీ, అలా చేసేస్తాడు వాడు అన్నారు.

నేను నా వైపు చూసి చెప్పడంతో చిరునవ్వు నవ్వాను. "ఎంత చేసినా అమ్మ రుణం తీర్చుకోలేము" అన్నాను.

"అమ్మా రుషీ నా పేరు దేవకి. నేను ఫిలాసఫీ ప్రొఫెసర్‌గా ఎంతో మంది స్టూడెంట్స్‌కి పిలాసఫీ బోధించాను. ఈ ఆధారపడడం అనేది బాధ. రెండు వైపుల వారికీ బాధే. కానీ ఇందులో ఎంత తీపి వుందంటే ఇది ఓ వ్యసనంగా మారుతుంది. భార్యాభర్తల మధ్యన కానీ, తల్లీ పిల్లల మధ్యకానీ ఇది అందమైన వ్యసనం"

ద్వారక ఆవిడ చెంపలు నిమిరి, "ఆ అమ్మాయిని మన ఇంటికి తీసుకొస్తాను, అప్పుడు చెప్పు నీ ఫిలాసఫీ పాఠాలు. ఇంక ఇప్పటికి వదిలెయ్" అన్నాడు.

"తప్పకుండా వస్తాం ఆంటీ" అన్నాడు ధీరజ్.

"రుషి చక్కగా వుంది పేరులాగే, ఈ అమ్మాయిని కూడా ఇంటికి తీసుకురా ధీరజ్. ఈ గడ్డమీద ఎన్నేళ్ళు వున్నా, మన తెలుగు వాళ్ళకి, తెలుగువాళ్ళు కనిపిస్తే ప్రాణం లేచి వస్తుంది" ఆవిడ చెప్పింది.

"దేబాకీ" నర్స్ వచ్చి ఆవిడకి ప్రిస్క్రిప్షన్ ఇచ్చింది.

"హాయ్ లూసీ.. సీయూ నెక్సట్ టైం" అని అని నర్స్‌తో చెప్పి "దేవకి అన్న నా పేరుకొచ్చిన తిప్పలమ్మా" ఆవిడ నవ్వింది.

"సీయూ..బై" అని ద్వారక నన్ను చూసి నవ్వి "ఫోన్ నెంబర్ ప్లీజ్" అన్నాడు. నేను చెప్పాను. నోట్ చేసుకున్నాడు.

"మా ఇంటికి ధీరజ్‌కి కుదరకపోతే నేనొచ్చి తీసుకెళ్తాను" అన్నాడు. నేను తలవూపాను.

వీల్ ఛైర్ తోసుకుంటూ, ధీరజ్‌తో మాట్లాడుతూ, ద్వారక ముందుకి వెళ్తుంటే, నాకు "అయ్యో అప్పుడే వెళ్ళిపోతున్నాడేంటీ? మళ్ళీ ఎప్పుడు చూస్తానో?" అనిపించింది.

ఇలా చాలాసార్లు మనసు వెళ్ళేవాళ్ళతో బాటు వెళ్ళిపోతుంటుంది. చాలామందిని ప్రేమించేస్తుంటుంది. ఏ ప్రేమ నిలబడ్తుందో చెప్పలేము.

అత్తయ్య ఇంటికొచ్చి మూడురోజులయింది. పరీకి చాలాసార్లు ఫోన్ చేసాను. "ఈ వీకెండ్‌కి తప్పక వస్తాను రిషీ, అమ్మని బాగా చూసుకుంటున్నందుకు చాలా థాంక్స్" అంది.

"ధీరజ్‌కీ నీకూ ఏమైనా పోట్లాట అయిందా?" అని అడుగుతుండగా, "వాడో ఫూల్. వచ్చినప్పుడు మాట్లాడ్తాలే" అని పెట్టేసింది.

ఇంటినుండి నాన్నగారూ, అమ్మా, బామ్మా రోజూ ఒక టైం పెట్టుకుని కాల్ చేస్తున్నారు. బామ్మకి అత్తయ్యగురించి చింత, నాన్నకీ అమ్మకీ నా గురించి.

"మన పక్కింట్లో వుండి వెళ్ళారే కాంతరావుగారు, వాళ్ళ అబ్బాయి స్టేట్స్ నుండి వచ్చాడుట. ఎంత బావున్నాడో నీ పక్కన ఒడ్డూ పొడుగూ ఎంతో బాగుంటాడు. పేరు కూడా బావుంది రవికాంత్. నీ ఫోటో పంపించా. బావుంది అన్నాడు. ఒకసారి మాట్లాడతావా?" అమ్మ ముచ్చట పడిపోతూ అడిగింది.

పెళ్ళి సంబంధాలు చూడడం మానలేదు.

"కాంతరావుగారి పెళ్ళాం, పూర్ణా అంటీ నాకు తెలుసు. ఎంత కట్నం అడిగారో అది చెప్పు. ఆవిడ కూతురి పెళ్ళికి రెండు కోట్లు ఇచ్చాం అని చెప్పుకోవడం నేను విన్నాను" అన్నాను.

"అది తర్వాత సంగతి, పిల్లాడు బావున్నాడు.రణబీర్ కపూర్‌లా" అంది అమ్మ.

"ఆ రెండు కోట్లూ వుంటే నాకివ్వు. నేను హోటల్ పెట్టుకుంటాను సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీం కింద" అన్నాను.

"వేళాకోళంగా వుందా?" అమ్మ అరిచింది.

"జీవితాంతం నా కాళ్ళమీద నేను నిలబడడం మంచిదా? ఎవడికో ఇచ్చి ఆయన అడుగులకి మడుగులు వత్తాలా? రేపు రెండు కోట్లూ ఇచ్చాక, వాడికి నేనో, నాకు వాడో నచ్చకపోతేనో? మొత్తం డబ్బు నష్టమేగా?"

"ఛీ.. అపశుభం మాటలు."

"లాజిక్ ఆలోచించు అమ్మా, నేను హోటల్ బిజినెస్‌లో కోట్లకి పడగలెత్తితే, నువ్వే గర్వంగా ఒళ్ళంతా నగలు పెట్టుకుని , మెర్సిడీస్ బెంజ్‌లో తిరుగుతావు తెలుసా?"

"అసలు నువ్వు పెళ్ళి చేసుకోవా?" వసుంధర కోపంగా అడిగింది.

"సక్సెస్ రేట్ ఎంత అంటావ్? నువ్వే కనీ, పెంచీ కూడా నన్ను భరించలేనంటావే ఎవరింటి పిల్లాడో నన్ను ఎలా భరిస్తాడూ?"

"నీ వితండంతో చచ్చిపోతున్నాం. సరే ఫిఫ్టీ ఫిఫ్టీ ఛాన్సెస్ అయినా ఆ నష్టానికి ఒప్పుకుని మేం చేస్తాం చేసుకో" అంది.

"అంతకన్నా ఎవరితో అయినా ట్రయల్ పిరేడ్ చూసి, సక్సెస్ అవుతుందని అనిపించాక చేసుకోవడం మంచిది కదా! కట్నం కూడా ముందే ఇవ్వక్కర్లేదు. ఏవంటావ్?"

అమ్మ నాన్నకి ఫోన్ ఇచ్చేసి వెళ్ళిపోయింది.

నాన్న నవ్వుతూ "ఇంట్లో సందడే లేదమ్మా నువ్వు లేకపోతే. వసుంధర టీవీ పెట్టుకుని, అలవాటుగా రిషీ..రిషీ అని పిలిచి, బదులు రాక మూగగా కూర్చుంటోంది. త్వరగా వచ్చెయ్యి" అన్నారు.

"రవికాంత్‌ని చేసుకోడానికా? అయినా వాడేం త్రేతాయుగపు మనిషి నాన్నా, ఫోటో చూసి చేసుకుంటానంటున్నాడూ, పెద్దవాళ్ళు ఏం చెపితే దానికి తల వూపుతాడా? యూ.ఎస్.లో చదివాడంటున్నారూ" అన్నాను.

"నువ్వు మెచ్చినవాడు నీకు అందడు. నిన్ను మెచ్చిన వాడు నీకు ఆనడు. ఆరు ఏళ్ళుగా ఆలోచిస్తూనే వున్నాను. ఫలితంగా ఇంకా కుమారిగానే వున్నావు. పెద్ద వయసులో తల్లితండ్రులకి ఇవ్వవలసినది మీ సంపాదనా, మీ పేరూ కన్నా, మనశ్శాంతి.. మనశ్శాంతి ముఖ్యం. తమ్ముడు వస్తాడుట వచ్చేవారం నిన్ను కలవడానికి" అన్నారు.

చాలా సంతోషంగా అనిపించింది.

"అవును మొన్న ఫోన్ చేసినప్పుడు వస్తావా? అని నేనే అడిగాను" అన్నాను.

హనీష్ వస్తున్నాడంటే నాకు చాలా ఆనందంగా వుంది. రెండేళ్లయింది చూసి. ఎంతైనా ఒక కంచంలో తిని, ఒక మంచంలో పోట్లాడుకుంటూ పెరిగిన వాళ్ళం. వాడికన్నా క్లోజ్ ఎవరు నాకు?

అత్తయ్యకి తల దువ్వి, జడేస్తుంటే అడిగింది "వసుంధర చెప్పింది, ఏదో సంబంధం  చూసారటగా ఒప్పుకో. మీ నాన్న రిటైర్ అయిపోతున్నాడు. కాస్త స్థిమితంగా వుంటుంది నీ పెళ్ళయితే వాడికి" అంది.

"నాకు పరీలా ఉద్యోగం, సద్యోగం లేదనా అత్తయ్యా, పెళ్ళి చేసుకోమంటున్నావ్?" అన్నాను అభిమానం గాయపడి.

"కాదు" అంది.

"మరి?" అన్నాను.

"నువు చెప్పినమాట వింటావనీ. అది మా మాట వినదు. అసలు ఇక్కడ పుట్టిన పెరిగిన పిల్లలు ఎవరూ వినరు. కానీ మా అదృష్టం కొద్దీ, ధీరజ్‌ని పెళ్ళి చేసుకుంటానంది. ఎంతో ఆనందం వేసింది. అరవిందా నేనూ ఒక ప్రాణంగా పెరిగాం. అది నా వియ్యపురాలు అవుతుందంటే మురిసిపోయాను. కానీ పెళ్ళి మాట అంటే విరుచుకు పడ్తోంది. అర్ధం కావడంలేదు" విచారంగా అంది.

నేను దువ్వెన పక్కన పెట్టేసి, "అతనంటే ఇష్టం కానీ పెళ్ళి అంటే ఇష్టం లేదేమో పోనీ కొన్నాళ్ళు లివింగ్ టుగెదర్ అయితేనో" అన్నాను.

"వాళ్ళు పల్లెటూరి వాళ్ళు. ఈ మాట అంటే నన్ను చెప్పు తీసుకుని కొడతారు" అంది అత్తయ్య.

"మీ పద్ధతులు మీవేకానీ, మా ఇన్‌సెక్యూరిటీస్ గురించి ఆలోచించకపోతే ఎలా అత్తయ్యా?" అన్నాను.

"అయినా ఆ మాట అయినా అతనితో చెప్పొచ్చుగా? ఈ దేశంలో ఇల్లు విడిచి వేరే వెళ్ళిపోయాక పిల్లలు, ఎవరితో వుంటున్నారో, ఎక్కడ వుంటున్నారో మాకు తెలుసా ఏమైనా?" అంది బాధగా అత్తయ్య.

"అమ్మయ్యా ఆమాట మీద వుండు. నేను మాట్లాడ్తను దానితో, అన్నట్లు వచ్చేవారం హనీష్ వస్తున్నాడుట" అన్నాను.

అత్తయ్య ఆనందంగా "వాడొస్తే ఇల్లు ఇంకా సందడిగా వుంటుంది. వాడిదంతా మా తాతగారి పోలిక, హనుమంతరావుగారిలాగే వుంటాడు. అందుకే హనీష్ అని పేరు పెట్టారు" అంది.

"అదా సంగతీ! హనుమంతరావుని 'హనీష్' అని మార్చారా? మరి నాకెందుకీ బ్లాక్ అండ్ వైట్ హీరోయిన్ పేరూ?" అన్నాను.

అత్తయ్య నవ్వింది.

ధీరజ్ అత్తయ్య ఇంటికొచ్చిన పూటే కేలిఫోర్నియా వెళ్ళిపోయాడు. పరీ వస్తుందని నేను ఎదురు చూస్తున్నాను.

వీకెండ్ కొస్తుందనుకున్న పరిమళ బుధవారంనాడు వచ్చింది. ఒక్కతే రాలేదు. వెంట ఒక మెక్సికన్ అమ్మాయిని తీసుకునొచ్చింది.

నేను తలుపు తియ్యగానే కౌగిలించుకున్నాను.

"అవ్లీన్ దిసీజ్ రిషీ, మై కజిన్ రిషి. అవ్లీన్ " అని పరిచయం చేసింది.

హడావిడిగా అత్తయ్య రూములోకి వెళ్ళింది. కాసేపటికి గొడవ వినిపించింది. మామయ్య గట్టిగా "అంత కుదరకపోతే రాకుండా వుండాల్సింది. ఇంత చేసిన, కన్నవాళ్ళం నీకు ఎందుకూ పనికి రానివాళ్ళం అయ్యాము. దాన్ని ఎందుకు తెచ్చావ్?" అంటున్నారు.

పరీ కూడా ఘాటుగా "అది రాకపోతే నేనూ వచ్చేదాన్ని కాదు. మా ఇద్దరికీ ప్రాజెక్ట్ వుంది. కలిసి చెయ్యాలి" అని అరిచింది.

ఆ రాత్రి భోజనాల దగ్గర అందరూ మూతి ముడుచుకునే వున్నారు.

పరితో మాట్లాడాలని నేనెంత ట్రై చేసినా టైం కుదరలేదు. ఆ అవ్లిన్‌తోనే మాట్లాడ్తూ వుంది. ఇద్దరికీ ఏదో సమస్య. బహుశా ఆఫీస్ పనై వుంటుంది అని నేను గదిలోకి వచ్చి పడుకున్నాం. లైట్ ఆర్పి నిద్రకి ట్రై చేస్తుంటే నా సెల్ మోగింది.

లైట్ వెయ్యకండానే, ఫోన్ తీసి "హలో" అన్నాను.

"నేను.. హస్తినాపురం లేదా మీ నయా ఢిల్లీ" అని వినిపించింది.

నిద్రమత్తు వదిలిపోయింది. హలో .. వాట్ ఏ సర్‌ప్రైజ్" అన్నాను.

"మునీశ్వరి మణికి సంతోషంగా వున్నట్లుంది" అన్నాడు.

"అదిగో ఆ పేర్లు పెట్టొద్దు. అసలే నా పేరు బావుండదు. ఇంకా చిరాగ్గా ఎందుకు మార్చడం?" అన్నాను.

"మీ పేరు చాలా బావుంటుంది. ఎంత బావుంటుంది అంటే మూన్‌లైట్ డిన్నర్ చేస్తూ మనిద్దరం ఒకే కప్పులోనుండి కసాటా ఐస్‌క్రీం తిన్నంత" అన్నాడు.

అతను తనకి అలవాటయిన ఫ్లర్టింగ్ మూడ్‌లోకి వెళ్ళిపోయాడని అర్థమైంది.

"మా ఇంటికొచ్చి నన్ను మీ ఇంటికి తీసుకెట్లానన్నారూ? ఇన్నాళ్ళకి గుర్తొచ్చానా?" అన్నాను.

"మా ఇల్లు చూసి మీరు విరుచుకు పడిపోకుండా, కొంచెం సర్దాక తీసుకెళ్దామని. రేపు ఓకేనా? వీకెండ్ దాకా ఆగలేను సెలవు పెట్టేస్తా" అన్నాడు.

"ఆగలేను" అన్న మాట గిలిగింతలు పుట్టించింది.

"అవునూ ఆ రోజు ఫ్లయిట్‌లో కలిసిన లేపాక్షి నెంబరి ఇచ్చిందా? ఎంత వరకూ వచ్చింది ఆ ఫ్లర్టింగ్?" అన్నాను.

"లేపాక్షీ.. కామాక్షా? ఏదో నిన్ను వుడికించాలని ఆమెతో కాసేపు టైం పాస్ చేసాను అంతే. బాగా వర్క్ ఔట్ అయింది" అన్నాడు.

"వర్క్ ఔట్ అయిందా?" అరిచాను.

"కాదా? నేను గుర్తురాలేదా? ఫ్రాంక్‌గా చెప్పు" అన్నాడు.

"తమాషా పేరు కదా! అందుకని గుర్తున్నావ్" అన్నాను.

"జున్ను ముక్క గులాబీ రేకుల మీద పెట్టి, కొన్ని హనీ డ్రాప్స్ వేసి దాన్ని నాలిక చివరతో నాకితే ఎలా వుంటుందీ?" అడిగాడు.

అతను చెప్పిందంతా గుర్తు చేసుకుంటూ "ఏంటీ? ఎలా వుంటుందీ?" అన్నాను.

"నీ బుగ్గమీద నాలిక చివరతో రాసి, అప్పుడు చెప్పగలను" అన్నాడు.

ఫ్లర్టింగ్‌లో ఇంత ఓల్డ్ టెక్నిక్స్‌కి ఎలా పడిపోతానబ్బా! అనుకున్నాను

"రేపు ట్రై చేద్దామా?" అడిగాడు.

"రేపా?" ఆలోచించాను.

"ఆయి విల్ ప్రామిస్ యూ.. నీకు ఇష్టంలేకుండా, నీ చిటికెన వేలు తాకను" అన్నాడు.

"ఛీ..ఛీ అందుకు కాదు. అత్తయ్య గురించి ఆలోచించాను" అని "సరే పరీ వుందిగ వస్తాను" అన్నాను.

"అయితే ఫోన్ పెట్టేసి రేపు ఈవినింగ్ ఐదు కావడానికి ఎన్ని నిమిషాలో లెక్కపెడ్తాను" అన్నాడు.

"అబ్బో" అని నవ్వాను.

తర్వాత రాత్రి నిద్రపట్టడానికి కష్టం అయింది. ద్వారక నా చెంపమీద నాలికతో రాస్తూ జున్ను ముక్క మీద తేనె చుక్కలు ఇలా వుంటాయా? అన్నట్లు చెవిలో గుసగుసగా వినిపిస్తుంటే కలత నిద్రే పోయాను.

***

ఠంచన్‌గా ఐదింటికి అతని కారు అత్తయ్య వాళ్ళ ఇంటిముందు ఆగింది. వైట్ కలర్ మెర్సిడజ్ బెంజ్, అత్తయ్యకి చెప్పి, పరికి చెప్దాం అని వెళ్తే, మావయ్యా పరీ గొడవ పడ్తున్నారు.

"దాన్ని పంపేసెయ్. ఓసారి ధీరజ్‌తో మాట్లడు" మామయ్య కోపంగా అన్నారు.

"ఆమెకి భాష అర్ధం కాకపోయినా, నువ్వు ఏం అంటున్నావో నీ మొహాన్ని బట్టి అర్ధం చేసుకుంటుంది.. నెమ్మదిగా నాన్నా" అంటోంది పరి.

వెనక్కి తిరిగి వచ్చేసాను. గులాబీ రంగు టాప్, కింద అదే లెగిన్, పైన బ్లాక్ జాకెట్ వేసుకున్నా. జుట్టు తలంటు పోసుకోవడం వలన ఎగిరి మొహం మీద పడ్తోంది.

ద్వారక దిగి కార్ డోర్ తెరిచి పట్టుకున్నాడు. అతని కన్‌సర్న్ చాలా హాయిగా వుంటుంది. నేను అతని పక్కన కూర్చుని సీట్ బెల్ట్ పెట్టుకున్నాక "మెక్సికనా? ఇటాలియనా? ఏం తిందాం?" అన్నాడు.

"ఇప్పుడా?" అన్నాను.

"ముందు కాసేపు తిరిగి ఇంటికి వెళ్ళి అక్కడనుండి వెళ్దామా?" అన్నాడు.

"ఔను, అసలే ఇల్లు నాకోసం క్లీన్ చేసావుగా?" అన్నాను.

"కరెక్ట్" అని "అది ముందా? తర్వాతా?" అన్నాడు.

"ఏది?"

"జున్ను ముక్కమీద తేనె చుక్కలు వేసినట్లుందా అని చూడడం?" అన్నాడు.

"ఏయ్?" చిరుకోపం అభినయించాను. అతను డ్రైవ్ చేస్తూ ఓ చోట స్లో చేసాడు.

"ఏవైంది?" అని అడిగేలోపు, నన్ను దగ్గరగా తీసుకుని, బుగ్గమీద గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు."

నేను అమాంతం విడివడి వెనక వచ్చే కార్లకేసి చూసాను.

"ఎవరూ పట్టించుకోరు" అన్నాడు.

నేను కోపంగా "ఇలా అయితే నేను వెళ్ళిపోతాను" అన్నాను.

"నడిచా?" అడిగాడు.

"కేబ్‌లో"

"నేనేం తప్పు చేసా?"

"నా ఇష్టం లేకుండా నా చిటికెన వేలుకూడా ముట్టుకోనన్నావ్" అన్నాను.

"నీ ఇష్టం లేకుండా అండర్ లైన్.. ఇది మొదటి పాయింట్. రెండోది నీ చిటికెన వేలు ముట్టుకోనన్నాను. కూడా అనలేదు. అండర్‌లైన్. నిజం చెప్పు. ఇష్టంలేదా?" అన్నాడు.

ఆలోచనలో పడ్డాను.

ఆడపిల్లకి ఇష్టంలేకపోతే ఆమడ దూరంలో నిలబెడ్తుంది. అతను నచ్చాడు. అతన్ని చూడాలనిపించింది. అతను తాకితే ఇష్టంగ అనిపించింది. ఇంకెందుకు బెట్టు?

"నిజం చెప్పు" రెట్టించాడు.

"ఊ" అన్నాను బెట్టుగానే.

"దట్స్ లైక్ ఏ గుడ్ గర్ల్. కాఫీ తాగుదామా? బీరా?"

"వాట్?" అన్నాను.

"కాఫీ ఇంట్లో పెడ్తాను. బీర్ తాగుదాం. ఇక్కడ  బార్ చూపిస్తాను. ఫుడ్ కూడా వుంటుంది" అన్నాడు.

"ఒద్దు.. ఇంట్లో" అని నసిగాను.

"ఏం కాదు. ఎవరికీ తెలీదు. లైట్‌గా తీసుకోవచ్చు" అన్నాడు.

COMMENTS